కథాకాలం : 1977

# రచయిత మరణం

రామారావు కథ రాయాలనుకున్నాడు. కథ రాయాలని కలం పుచ్చుకొని కూర్చుంటే మనసులో అనేక భావాలు మెదుల్తాయి అతనికి. కథ రాయాలని కాగితాలు సర్దుకొని కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్న అతని గదిలోకి మీనాక్షి ప్రవేశించింది.

''ఇంకా తెల్లార లేదు, అప్పుడే మీరు ...మీ కాయితాలు మీ రాతలు మొదలు. అవతల నేను ఊపిరి సలపని పనిలో చస్తున్నాను. పని మనిషి ఈ వేళ కూడా ఎగనామం పెట్టింది." పక్కబట్టలు సర్దుతూ మీనాక్షి భర్త మీద విసుగుతో దీర్ఘంతీసి అక్కణ్ణించి వంటింట్లోకి వెళ్లిపోయింది.

రామారావు తన ఆలోచనలకి భంగం కలిగినందుకు చిరాగ్గా ముఖం చిట్లించి వెళ్లిపోతున్న భార్యకేసి విసుగ్గా చూసాడు.

రామారావు పి.డబ్ల్యు.డి. ఆఫీసులో సీనియర్ క్లర్కు. అడపా దడపా కథలు రాస్తుంటాడు. అతనికి మొదటి ముగ్గురూ ఆడపిల్లలు, తరువాత ముగ్గురూ మగపిల్లలూ పుట్టారు.

చిన్న ఉద్యోగం, పెద్ద సంసారంతో సతమత మవుతూనే అతను కలల లోకాల్లో విహరిస్తుంటాడు అప్పుడప్పుడు. అలాంటి సమయాల్లో కథలు రాస్తూ ఉంటాడు. కథ రాస్తున్నంత సేపూ తను నిలబడ్డ నేలని మరచిపోయి తనకందని ఆకాశాన్ని వర్ణించడానికి తంటాలు పడుతుంటాడు.

ఆరోజు హాయిగా చక్కని కథ రాద్దామని కూర్చుంటే మీనాక్షి వచ్చి తన బుర్రంతా పాడుచేసింది. రామారావు చిరాగ్గా కుర్చీలోంచి లేచి ఓ సిగరెట్టు వెలిగించి అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆలోచనలో పడ్డాడు.

లోపల వంటింట్లోంచి మీనాక్షి చేస్తున్న గిన్నెల చప్పుడు వినబడు తూనే ఉంది. నెలాఖరు రోజుల్లో, ఇంట్లో సరుకులయిపోయి నప్పుడు ఆవిడ అలా గిన్నెలు చప్పుడు చేస్తూ ఉంటుంది.

నెలాఖరున ఇంట్లో అన్నీ నిండుకుంటాయి. జేబులో సిగరెట్టుకీ, కిళ్లీకి, వక్కపొడికీ కూడా డబ్బులుండవు. కిరాణాకొట్లో బాకీ భయ పెడుతూ ఉంటుంది. ఒకటో తారీఖున ఖచ్చితంగా ఇచ్చి తీరాల్సిన ఇంటద్దె గురించి నాలుగు రోజులు ముందు నించీ పోరుతుంటాడు ఇంటాయన. ఒకటో తారీఖున అవసరమైతే ఉపయోగించడానికి కారాలు, మిరియాలు నూరి సిద్ధంగా ఉంచుతాడు.

ఇన్ని బాధలు, చికాకుల మధ్య రామారావుకి కథ రాయాలని వుంది. వాస్తవాన్ని మరిపించి ఊహాలోకాల్లో మరిపించే అందమైన కథ రాయాలని అతనికుంది.

ఓ సిగరెట్టు తగలేసింతర్వాత, పోయిన ఉత్సాహం మళ్లా మనసులో తన్నుకొచ్చింది రామారావుకి. కుర్చీలో కూర్చొని పెన్ను చేతుల్లోకి తీసుకొని ఆలోచనలో పడిపోయాడు.

"ఓ అమ్మాయి"

ఆమె పేరు సుజాత....అంటే ఎంతో మంచి జాతకం కలది అని కదా అర్థం. తన హీరోయిన్ జాతకం తప్పనిసరిగా చాలా మంచిదై ఉండాలి. అందుచేత తన హీరోయిన్ పేరు సుజాత...ఆ అమ్మాయి ఎలా ఉంటుంది?...అమృతంలో ఊరిన వడియంలా ... ఆమె కళ్లెలా ఉంటాయి?...తుమ్మెద రెక్కల్లా ... అవును ఆ కళ్లు కలలుకంటూ విశాలంగా ఉంటాయి ... అవునా ఆమె ముఖం ఎలా ఉంటుంది? అప్పుడే పాకెట్‌లోంచి తీసిన సబ్బుబిళ్లలా? ...

అబ్బ ఎంత చక్కటి వర్ణన. రామారావు తన హీరోయిన్ అందచందాల వర్ణనను కాగితం మీద పెట్టబోయాడు.

అంతలో "బాబూ, కాణీ ధర్మం చెయ్యండయ్యా" అన్న మాట వినబడింది. తలతిప్పి అటువైపు చూసాడు. అసహ్యంతో గిరుక్కున తలతిప్పేసుకున్నాడు.

తాను మనస్సులో ఊహించుకుంటున్న హీరోయిన్‌కి పూర్తిగా విరుద్ధమైన రూపం. ఈ ముష్టిదాని కళ్లు కలలు కంటున్నట్టు లేవు.

కలలు కనడం మానేసినట్లు, వాటిని కనే ఓపిక లేనట్లున్నాయి. దాని ముఖం అప్పుడే పాకెట్ విప్పి రేపర్‌లోంచి బయటికి తీసిన కొత్తసబ్బు బిళ్లలా లేదు. కడగాల్సిన అంట్లగిన్నెలా ఉంది. ఎండిపోయి వేలాడుతున్న దాని వక్షోజాల మీద ఏ ఆచ్ఛాదనా లేదు. దాని శరీరంలో ఏ భాగాన్ని కప్పాలో తెలీక నడుమునుంచి మొలకిందికి వేలాడుతోంది ఓ గుడ్డముక్క.

దాన్ని చూస్తూనే రామారావుకి ఏడుపొచ్చినంత పనయింది. దాని దైన్యానికి కాదు. తన మనసులోంచి ఓ అందమైన రూపం కరిగిపోతున్నందుకు. మరు క్షణంలో అతను కోపంతో పళ్లు పటపట కొరికాడు.

"పో....పో...." అని కిటికీలో నిలబడి ముష్టిదాన్ని పిచ్చెత్తిన వాళ్ళా అరచి తరిమేసాడు. అది అక్కడ్నించి మెల్లగా ఈడ్చుకుంటూ కదలింది.

రామారావు చిరాగ్గా తలపట్టుకు కూర్చున్నాడు. ఆ ముష్టిదాని రూపాన్ని బలవంతంగా మనసులోంచి తరిమేసే ప్రయత్నంలో అతను మరో సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ కాలి బూడిదయింది. పొగ కరిగి పోయింది.

తన హీరోయిన్ సుందర రూపం తిరిగి తనకళ్ళముందు ప్రత్యక్షం అయింది.

రామారావు మళ్ళా ఆలోచనలో పడ్డాడు.... అదో పెద్ద బిల్డింగ్.... ఆ బిల్డింగ్‌లో అది సుజాత గది. గదిలో సుజాత హంసతూలికా తల్పం లాంటి పందిరి పట్టె మంచం మీద దేవుడు చెక్కిన శిల్పంలా వయ్యారంగా పడుకొని ఓ ఇంగ్లీషు పుస్తకం చదువుతోంది.... మధ్యమధ్య కిరన్ రాక కోసం తెరచి ఉంచిన గుమ్మం తలుపులకేసి చూస్తోంది.

మేడ మెట్ల మీద శబ్దమైతే చాలు అది కిరన్ అడుగుల చప్పుడేమోనని ఉత్కంఠతో చూస్తోంది... ఆమె కళ్ల అన్వేషణని నింపుకొని అదే చూస్తున్నాయి. ఛీ... కిరన్ ఎప్పుడూ ఇంతే - వస్తానన్న సమయానికి చచ్చినారాడు - తన కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడాలి..." అని విరహవేదనతో తనలో తాను ఉడికిపోతోంది.

రామారావు తాను ఊహించినదంతా కాగితం మీద పెట్టాడు. "పందిరి పట్టిమంచం" ఓల్డ్ ఫాషన్ కాబట్టి పందిరిపట్టి మంచం బదులు "స్ప్రింగ్ కాట్" అనే పదం వాడాడు. సుజాత ఇంగ్లీషు పుస్తకం చదువుతోంది అని రాస్తే చాలదనీ, ఇంగ్లీషు పుస్తకం పేరేమిటో, అది ఎవర్రాసిందో కూడా చెప్పాలనీ అతనికి తోచింది. "ఆ పుస్తకమన్నా సుజాత లాంటి డబ్బున్న అమ్మాయిలు చదవడానికి ఇష్టపడే కథాంశం ఉన్న పుస్తకం అయి వుండాలి. ఆపుస్తకం పేరు, దాని రచయితా (లేక) రచయిత్రి కూడ జనం నోళ్ళలో బాగా నానివుండాలి. అందువల్ల రచనకు కొంత వాస్తవికత వస్తుంది" — అని అతను అనుకున్నాడు.

అంతలో చిన్న కూతురు అలివేణి తండ్రి దగ్గరికి వచ్చి "నాన్నా! ఈ వేళ ఇంగ్లీషు పుస్తకం కొనుక్కురాకపోతే బళ్లోకి రానివ్వనన్నారు మాష్టారు" అని అంది.

"ఇంగ్లీషు పుస్తకమా! పేరేమిటి - ఎవర్రాసింది?" అని పరధ్యాన్నంగా అడిగి మళ్ళా నాలిక్కొరుక్కుని "బళ్లోకి రానివ్వనన్నారా మాష్టారు? ఓ పని చెయ్యి - బళ్లోకి వెళ్ళడం మానెయ్యి" అని సలహా ఇచ్చి అంతటితో ఆ సమస్యని ఒదిలించుకున్నాడు రామారావు. మళ్ళా కథ రాయడంలో మునిగిపోయాడు.

"సుజాత కిరన్ కోసం ఎదురు చూసి చూసి అలసి పోయి నుదుటికి పట్టిన చిరుచెమటని సుతారంగా రుమాలుతో తుడుచుకొని అంతకన్నా సుతారంగా చేయెత్తి వాచీవంక చూసుకొంది. టైము ఆరుంపావయింది".

టైము అప్పుడే తొమ్మిది కావస్తోంది. మీరు కూర్చున్న చోటునుంచి కదలలేదు. స్నానం చెయ్యలేదు. ఆ బాత్రూం పని ముగించుకు వస్తే నేను అంట్లు తోముకోవాలి." అంటూ మీనాక్షి మళ్ళా అక్కడికి వచ్చింది.

"అబ్బబ్బ బ్బా..." అని ముఖం చిట్లించి నిస్సహాయంగా చూసాడు భార్యకేసి రామారావు.

"నువ్వవతలకి వెళ్లు ... నా చెవులో రొదపెట్టి నన్ను విసిగించకు .... నేను కథరాసుకోవాలి..." అని అరిచాడు-

మీనాక్షి చిన్న బుచ్చుకొని, గొణుక్కుంటూ అక్కడ్నించి వెళ్లి పోయింది.

రామారావుకి మళ్ళా మూడ్ తెచ్చుకోవడానికి పదినిమిషాలు పట్టింది. క్రితం రాత్రి వర్షం కురిసింది.

అందువల్ల రోడ్డు బురద బురదగా చిత్తడి చిత్తడిగా ఉంది దూరంగా కాకా హోటల్లో కష్టమర్లు పోగయ్యారు. ఓ కాలేజీ అమ్మాయి కుచ్చెళ్ల బొడ్లో దోపుకుని, పరికిణీ బురదలో జీరాడకుండా జాగ్రత్త పడుతూ నడుస్తోంది.

ఓ కుర్రాడు ఆ అమ్మాయి అందాల్ని వెనక నుంచి కళ్లతో జుర్రేస్తూ బురదలో కాలేసి జర్రున జారి దబ్బున క్రింద పడ్డాడు. ఆ అమ్మాయి వెనక్కి తిరిగి ఆ కుర్రాడి వేధింపు ఆ రకంగా తీరినందుకు సంతోషిస్తూ

కాబోలు - కిసుక్కున నవ్వింది. బురదలో జారిపడ్డ కుర్రాడు తనని లేవనెత్తడానికి ఈ ప్రపంచం తయారుగా లేనందుకు, ఆ అమ్మాయి అలా తనని చూసి కిసుక్కున నవ్వినందుకూ కాబోలు - అయో మయంగా చూసాడు.

రామారావు కూర్చొన్న గది కిటికీ పక్క లాంతరు స్తంభానికి ఆను కొన్న ఓ పదేళ్ళ కుర్రాడు పక్కనున్న పెద్ద మనిషితో అంటున్నాడు. "ఈ వొరసం వచ్చి నా కడుపు కొట్టినాదిబాబు। ఈ ఏల చిత్తు కాగితాలు ఏరడం పడదు. తడిసిపోయిన కాయితాలు మిల్లుకాడ తీసుకోరు" అంటున్నాడు.

చిత్తు కాయితాలు ఏరడం వాడి వృత్తి- రోజంతా తిరిగి రెండు బస్తాల చిత్తు కాయితాలు ఏరి కాయితం మిల్లు వాళ్ళకి ఇస్తుంటాడువాడు. అందుకు వాడికి రోజుకో రూపాయి డబ్బులు కిడతాయి. ఆ రోజు వర్షం పడ్డం వల్ల వాడి వృత్తి దెబ్బతింది. ఆ పూట గడవటం వాడికి పెద్ద సమస్య.

కిటికీలోంచి బైట రోడ్డు మీదికి సాలోచనగా చూసిన రామారావుకి ఈ దృశ్యాలు కనిపించాయి.

అతని కలా వర్షం పడి వెలిసిన తరువాత వాతావరణం అంటే చాలా ఇష్టం. చల్లని ఆ వాతావరణంలో నులివెచ్చని కోరికలు కలుగు తుంటాయి అతనికి. అటువంటి వాతావరణంలో వేడివేడి పకోడీలు తిని ఓ టీ త్రాగి, ఓ సిగరెట్టు వెలిగించి కథముందు కూర్చుంటే, కథ రేసు గుర్రంలా పరిగెడుతుంది. ఆ ఆలోచన రాగానే రామారావు కుర్చీకి తగిలించి ఉన్న చొక్కా తీసి చిల్లర లెక్క పెట్టాడు. రూపాయి మీద పది పైసలు - పర్వాలేదు అనుకున్నాడు.

చొక్కా తొడుక్కొని చెప్పులో కాళ్లు దూర్చాడు. "అలా బైటికి వెళుతున్నారేమో; వచ్చేటప్పుడు ఓ తోటకూర కట్ట పట్టండి, పులుసు కాస్తాను" అంది వెనక నించి మీనాక్షి.

"అలాగే" అంటూ రామారావు వీధిలోనికొచ్చాడు. ఎదురుగా వున్న కాకా హోటల్ వైపు దారి తీశాడు.

అలా నడుస్తూ మరలా తాను రాయబోయే కథ గురించి ఆలోచించాడు.

"సుజాత కిరణ్‌కోసం ఎదురు చూస్తోంది . . వచ్చేటప్పుడు తోటకూర పట్టండి, పులుసు కాస్తాను ... సుజాత అప్పుడే పాకెట్ లోంచి తీసిన కొత్త సబ్బు బిళ్ళలా ఉంది ... నాన్నా ఈ వేళన్నా ఇంగ్లీషు పుస్తకం కొనుక్కురాకపోతే బళ్లోకి రానివ్వ నన్నారు మాష్టారు ... సుజాత సుతారంగా చేయెత్తి వాచీ వంక చూసింది - టైము తొమ్మిదవ్వస్తోంది - త్వరగా బాత్రూం పనిముగించుకు రండి - అంట్లు తోముకోవాలి ... సుజాత ఇంగ్లీషు నవల చదువుతోంది ... ఈ వొరసం ఈ వేళ నాకడుపు కొట్టింది ......"

రామారావు బుర్ర ఆలోచనలతోనే వేడెక్కిపోయింది. మనసు రకరకాల ఆలోచనలతో అస్తవ్యస్తంగా తయారయింది.

రామారావు గబగబా అడుగు లేసుకొంటూ తిరిగి వెనక్కి చూడకుండా హోటల్లో కొచ్చి పడ్డాడు. మనసులో చిరాకు రెట్టింపయింది.

హోటల్ కూడా రద్దీగా తన మనసులాగే చిరాగ్గా వుంది. ఆ హోటల్లో ఓ చివర ఓ మనిషి బిల్లుతీసుకుని లేవగానే గబుక్కున వెళ్ళి ఆ సీట్లో కూర్చున్నాడు రామారావు.

రద్దీ ... రద్దీ ... జనం... పుట్ట గొడుగుల్లా పుట్టేస్తున్నారు వెధవలు. .

బ్రతుకు లేదు గానీ హోటళ్లూ సినిమాలూ కావాలి అందరికీ. అసలీ వెధవలే రేట్లు పెంచేస్తున్నారు. వ్యాపారస్తులు కాదు. ఏ హిట్లరో వచ్చి ఈ వెధవలందరిని వరసబెట్టి కాల్చేస్తే తాను సంతోషిస్తాడు.

ఇలా ఆలోచిస్తున్నాడు రామారావు.

అంతలో అక్కడికి సర్వరొచ్చాడు "ఓ ప్లేటు పకోడీ ... ఓ టీ త్వరగా పట్రావాలి" అని రామారావు ఆర్డరు వేశాడు.

రామారావు పకోడీకి ఆర్డరు వేసి వాడొచ్చేలోగా రాయబోయే కథ గురించి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

సర్వర్ పకోడీ ప్లేటుని ఆచివరి నించి ఈ చివరికి జర్రున త్రోసి, టీ గ్లాసుని పెద్దగా చప్పుడు చేస్తూ బల్లమీద పెట్టి వెళ్ళి పోయాడు. గ్లాసులోంచి టీ త్రుళ్లి పడి టేబుల్ మీద చిందింది.

"వెధవ పొగరు ... ఈ సర్వర్ వెధవలకూ్కడా పొగరే ..." అని మనసులో రామారావు మళ్ళా చికాకు పడ్డాడు. ఆదరా బాదరా పకోడీ తినడం మొదలు పెట్టాడు.

ఇంతలో రోడ్డు మీద ఏదో అలజడయింది. బిలబిలలాడుతూ జనం నడిరోడ్డు మీద గుమి గూడుతున్నారు. అంతలోనే నవ్వుకొంటూ కొందరు, ముఖం ముడుచుకొంటూ మరి కొందరు ఛీ ... ఛీ ... ఛీ .. అనుకొంటూ చెదిరిపోతున్నారు. రామారావు తినడం ఆపుచేసి ఆ దృశ్యం ఏమయ్యుంటుందా అని ఆలోచించాడు. ఐనా తెల్లారిలేస్తే ఈ హైదరా బాద్ నగరంలో అనేకం జరుగుతుంటాయి. వాటి జోలి మనకెందుకు

అని అంతలోనే సమాధానపడి పకోడి తినడం పూర్తిచేసి, చల్లారిన టీ గడగడ తాగేసి బిల్లు చెల్లించి జేబులో మిగిలిన ఒకే ఒక్క పదిపైసల బిళ్ళతో బైటకొచ్చాడు.

జేబులోంచి చార్మినార్ సిగరెట్ ప్యాకెట్ బైటకి తీసి అందులో మిగిలిన ఒకే ఒక్క సిగరెట్టుని నోట్లో పెట్టుకుని మార్కెటుకేసి వెళ్ళబోయి అంతలోనే దారి మార్చుకుని అయిష్టంగానే నడి రోడ్డు మీద గుమిగూడిన జనం దగ్గరికి కదిలాడు.

"ఏమిటి మాష్టారూ - ఏమైంది" అని అడిగాడు ఓ పెద్ద మనిషిని.

"ఆ ... ఏంలేదు సార్ - ఎవరో ఆడది - పిచ్చిది - గుడ్డలు విప్పుకుని సిగ్గులేకుండా నడి రోడ్డు మీద పడుకొని ఉంది—" అన్నాడు ఆ పెద్దమనిషి.

"ఛీ ... ఛీ ... " అని మనసులో ఛీత్కరించుకున్నాడు రామారావు. చూడకుండా వెనక్కి పోదామనుకున్నాడు ముందు. ఆ తరవాత ఆలోచన మార్చుకొని జనం మధ్య నించి సందు చేసుకొని తాను కూడా ఆ పిచ్చి దాని నగ్న రూపాన్ని చూసి తన వంతు చిరాకు తాను ప్రదర్శించి "దానిక్కాదు సార్ సిగ్గు ... అసలు చూసే వాళ్ళకు సిగ్గు లేదంటాను'' అనేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

మార్కెటు వైపు వెళ్ళాడు.

మార్కెట్లో ఓ తోటకూర గంప దగ్గర ఆగి బేరం మొదలు పెట్టాడు. బేరం తెగలేదు. ''కొన్నావు లేవయ్యా వెళ్ళు వెళ్ళు'' అని తోటకూర చిన్నది రామారావుని కసిరేసింది.

అది పువ్వుల కోక కట్టింది, కొప్పులో పూలెట్టింది; నుదిటిన రూపాయి కాసంత బొట్టు పెట్టింది. కొనడానికొచ్చిన వాళ్ళని సులభంగా బుట్టలో వెయ్యగల్దు ... తన తోటకూర బుట్టలో వెయ్యగల్దు ... అనుకున్నాడు రామారావు.

తోటకూర కొనకుండానే ఇంటి ముఖం పట్టాడు. గుమ్మంలో ఎదురైన మీనాక్షి చేతిలో మాట్లాడకుండా పదిపైసల బిళ్ళ పెట్టి విస్తుపోతున్న ఆమెకు సమాధానం చెప్పకుండా తన గదిలోకొచ్చాడు.

కిటికీ తలుపులు మూసి, ఇంటితోను ప్రపంచంతోను సంబంధా లు తెంచుకొని ముష్టిదాని రూపాన్ని, చిత్తు కాగితాలు ఏరే కుర్రాడి నిరాశని, నడి రోడ్డు మీద నగ్నంగా పడి ఉన్న పిచ్చిదాన్నీ, బురదలో జారిపడ్డ కాలేజీ కుర్రాణ్ణి, కొప్పులో పూలూ, పువ్వుల కోకతో జనాన్ని తన తోటకూర బుట్టలో వేయడానికి సిద్ధంగా ఉన్న తోటకూర దిస్సు దాన్ని మనసులోంచి తరిమేశాడు.

స్విచ్చినొక్కి లైటు వేసి చీకటిని తరిమేసి, కుర్చీలో కూర్చుని, కలం కాయితాలు సర్దుకుని తన హీరోయిన్ స్నిగ్ధ సుందర రూపాన్ని మనసులోంచి కలం పాళిలోంచి కాయితం మీదకు ఎక్కించడంలో మునిగి పోయాడు.